స్కెచ్

# 'జైను లంతే...'

నంబూరి సుబ్బరాజు

నేనూ రైలు దిగేసరికి పదకొండు కావచ్చింది. స్టేషన్‌నుంచి ఇంటికి మైలుదూరం ఉంది. విపరీత ప్రయాణంవల్ల బడలిక ఎక్కువై, గుడ్డలూ గడ్డం తెగమాసి ఛిరాగ్గావున్నాయ్. హోల్‌డాల్ కుర్రాడి నెత్తినిబెట్టి 'ఘటం' ఇంటికి జేరేశా. ఆకలి దహించుకపోతోంది. నిన్న ప్రొద్దున్న మద్రాసులో తిన్నతిండి. రాత్రి తెల్లవార్లు మెయిల్‌లో కంచి గరుడి సేవ. కూర్చోవడానికే ఖాళీ లేదు. ప్రొద్దున్న గుడివాడలో మళ్లా సరిచూస్తే లెక్క, శాఖీకి ఎన్నివిధాలా చూచినా సరిపోలేదు. ఆకీడు స్టేషన్‌లో ఒక స్నేహితుడు కనిపిస్తే వాడి దగ్గర ఒక సిజర్ సిగరెట్టు సంపాదించి మత్తు వదిలించుకొన్నా. ఆకలి దహించుక పోతోన్నా స్నానం చేయకుండా రెండు మెతుకులు నోట్లో వేసుకోవడానికి ప్రాణం వొప్పలేదు. స్నానంజేసి, భోజనంచేసి కుంభకర్ణపాత్ర తీసికొన్నాను... తకామని మూడింటికి మెలకువచ్చింది. సేఫ్టీ రేజరు తీసికొని గడ్డం శుభ్రపర్చుకొని, బేసిన్‌లో నీళ్ళు పోసి సబ్బుతో ముఖం శుభ్రంగా కడుక్కొని; పంచె అని కేకవేస్తే 'నహీ' అని జవాబువచ్చింది. ఈ వెధవ సంసారం ఎప్పుడూ ఇలాగే తగులడుతూ వుంటుంది. కొట్టుకు సరిపడి బట్టలున్నా కట్టుకోవడాని కెప్పుడూ గుడ్డకరువే. (మహా ఉన్నట్టు) ఇంటిలో ఆడవాళ్ళ వొబ్బిడి లేకపోతే ఇబ్బందులు ఎక్కువే అని ఎన్నిసార్లు చెప్పినా లక్ష్యమా ఏమన్నానా! గట్టిగా మాట్లాడితే కోపాలు తాపాలు. ఇంకా అయితే మహిళాసభలో తీర్మానాలు అని నోరు నొక్కుకొని...దగ్గరగావెళ్ళి... హోల్‌డాల్‌లో బట్టలు మాసిపోయాయి, బజారు పోవాలి బట్టలు తీసియ్యవూ అన్నాను.

ఆదేమిటండీ! ఇప్పుడు చెప్పాను గదూ లేవని. సరిగా చూశావా?

అమ్మ నేచచ్చిపోయినట్టండీ! చూచే చెప్పాను. బట్టలేమీ లేవు. వేళా కోళం అనా! పోని మీరే చూచుకోండి... అస లీమధ్య బట్టలేమి తీసికొన్నారు. పాతవేగా!

సరే ... నేచూస్తే ... లేనివి కనిపిస్తాయా! అంటూ పెట్టెదగ్గరకు వెళ్లి చూసేసరికి...పద్దెనిమిదేండ్లనాడు పెండ్లికి అత్తారుపెట్టిన మధుపర్కం కనిపించింది. అది వాడడం లేదు. మనుమలు కలిగేవరకు జాగ్రత్తగాఉంచి వాళ్లకి పొత్తిళ్లలో ఉంచాలని ఇంట్లోవాళ్లు భద్రపరిచారు. అది కాస్తా నేను బయటికి తీశా. ఆ కాలంనాటి ఒక ఉత్తరీయం, లాల్చీ కూడా దొరికాయ్. రక్తం పల్చబడిన తరువాత మనిషి రంగొచ్చినట్లు, ఖద్దరుగుడ్డలు చిరిగిపోయేముందు మంచి తెలుపు వచ్చి మహా అందంగా ఉంటాయ్ ... ఆలోచించకుండా వెంటనే దుస్తులువేసుకొని, పాతపంచె మడతలో దొరికిన పాతసెంటు ఒళ్లంతా రాసుకొని, కంటికీ, కాలికీ జోడు తగిలించి వంకబెత్తం పుచ్చుకొని, విడిచినచొక్కాలు వెదకడం ప్రారంభిస్తే కాస్త నలిగిన ఒక సిజరు సిగరెట్టు కూడా దొరికింది. అది జేబులోవేసుకొని, క్లబ్‌కు వెడదామా, కాలేజీవేపు వెళదామా? అని, బెత్తం త్రిప్పుకొంటూ గుమ్మం దిగి రెండడుగులు ముందుకు వేసేసరికి 'పూజారి' సుబ్బమ్మ ఎదురుగుండా వచ్చి, ఊళ్లోకేమిటి మాష్టారూ! అని పలకరించింది. ప్రాణం నిలువునా పోయింది. ముందుకు అడుగుపడదు. వెనక్కి వెళ్లదామాఅంటే చూచినవాళ్లు నవ్వుతారు. ముందుకే తెగబడ్డాను... మీరు వెళుతున్నారు కాబోలు, ఇంటిలో కిరసనాయిలు లేదు మరి- అని మాట వినిపించింది. వెళ్లడంలేదు, ఇప్పుడే వస్తాను అని బయలుదేరాను.

* * *

నశ్వరమైన ఐశ్వర్యాన్ని చూచుకొని త్రుళ్లిపడే మానవుడిలా, ఆశ్వీజమాసపు ఐశ్వర్యగాంభీర్యంతో మురుగుకాల్వ త్రుళ్ళిపడుతూ నేత్రానందం కలుగజేస్తోంది. నేనూ సిగరెట్టు పీల్చుకొంటూ, బెత్తం

ఊపుకొంటూ కాల్వవారగ చూస్తూ పోతున్నాను. సంధ్యాకాంతుల్లో, పచ్చని నా శరీరం మీద వున్న తెల్లని ఖద్దరువస్త్రములతో మలయ సమీరుడు దోబూచులాడుతుంటే ఒకచోట నిలబడ్డాను. దారేపోయే ఒక పెద్దమనిషి 'చిల్లరేమైనా ఉంటే ఒకపచ్చకాగితాని కిప్పిస్తారా?' అన్నాడు. 'షైరొచ్చేవేళ పెద్ద మొత్తాలు జేబులో వేసికొని రావలసిన పనేముంటుంది' అన్నాను మహాదర్జాగా, ఏభై రూపాయల ఉద్యోగం దొరుకుతుందేమో అని అయినవాళ్ళని కానివాళ్లని ఆశ్రయించిన శ్రీమంతుణ్ణయిన నేను... కాల్వలో సుళ్లు బయలుదేరినట్టు మనస్సులో భావపరంపరలు బయలుదేరాయ్. నొసలు పైకెత్తి ఆలోచనలో దిగా. ఇంతలో 'గుడ్డీవినింగుసార్' అనే ధ్వని కర్ణరంధ్రాల్లో పడింది. దృష్టి ధ్వనివైపు త్రిప్పాను. 'కళాశాలలో చదువు కుంటున్నాను. చాల పేదవాణ్ణి. తమబోంట్ల సహాయమువలననే చదువు సాగుతోంది.' అని మౌనంగా ఊరుకొన్నాడు.

నాగుండె బరువెక్కింది. నా దుస్తులు నేను బి.ఏ. కున్న రోజుల నాటివి. కట్టుకోను గుడ్డలేక పాత వాటితో బాధపడుతూవున్న నేను, 'అబ్బాయీ! నీవు కష్టపడి చదువుచున్నావ్-పరమ సంతోషం. మరొకప్పుడు కనబడు' అన్నా మహావితరణవంతుణ్ణయినట్టు.

నెమ్మదిగా గృహోన్ముఖుడనయ్యాను. 'సామీ నైజాం నుంచి వచ్చాం. ఆడ తురకోళ్లు ఇళ్లు తగలెడుతున్రు. మందిని చంపుతున్రు. కట్టుగుడ్డలతో పారివచ్చినమ్ దొరా! తలాకాస్త సాయం జేస్తుర్ దొరా!' అన్నాడు. నిజంగా నా మీద నాకే అసహ్యంపుట్టింది... దమ్మిడీ సంపాదన లేదు. కొత్త వైధవ్యంలా ఇంటిలో కూర్చుంటున్నాం ...అలాగటోయ్ పాపం...చాల ఇబ్బందే పడుతున్నారు. ఈ వంకతో మోసగాళ్లు కూడా ఎక్కువై పోయారు. అదంతా ఎందుకు—మీ నైజాం లొంగిపోయాడు. ఇంకమీరు వెళ్లిపోవచ్చు...అయినాతరువాత కనిపించండి-అన్నాను, ఎంతో హంగుచేస్తూ. 'కిరసనాయిలు'కు డబ్బులు లేక మొఖంచాటు వేసిన నేను...ముందుకు రెండు అడుగులువేశా; 'ఏడువకు తల్లీ! దైవమున్నాడు మన పాల' అని ఆకలి బాధతో ఏడుస్తున్న చంటివాన్ని జోకొట్టుతూ, 'బాబూ! పసిపాప. ఆకటికి తాళలేక ఏడుస్తు ఉండది. నేను కూటిమొకం చూచి మూడు దినాలైంది. బాబా! నీ రెక్కల కష్టం ఒక కాని పడెయ్యి బాబూ' అంటూ కన్నీరు త్రిప్పాడు ముసలాడు. కడుపులో చెయ్యి పెట్టి కదిపినట్టయింది. వికారంపుట్టి కళ్ళుతిరిగాయ్. డబ్బులెందుకోయ్ ఇంటికిరా, ఒకపూట తినిపోదువు గాని అన్నాను! బీడీలుకొని కాల్చుకొనడానికి డబ్బులు లేక ఖాళీ జేబులతో వున్న నేను.

స్నేహితులంతా నా దుస్తులు చూచి నాకేదో లాటరీలో డబ్బువచ్చిందనో; లేక మా బావ మరదులు విభాగాలై పోయారు గనుక, మా అత్తగారు డబ్బుతో, బంగారంతో వచ్చి, మా యింట్లో బైఠాయించిందనో మంతనాలు చేస్తుండే వాళ్ళని ఒదిలించుకొని ఇంటికి చేరా, స్తిమిత పడదామని. గుమ్మంలో అడుగుపెట్టీ పెట్టడంతోనే, 'ఏమండీ! చెప్పినాదు కేమిటి ఇంత తొందరగా వచ్చారు. ఇంటిలో కిరసనాయిలు లేదు. దీపం వెలిగించాలి. డబ్బు లిచ్చి వెళ్ళి ఉంటే కుర్రవాణ్ణి పంపి తెప్పించే దాన్ని గదా! ఇవాళ కోటా వచ్చిందిట. మళ్ళా అయిపోతుందేమో!' అని సణుగుడు ప్రారంభం అయింది. నాకూ చాలా చిరాకే పుట్టింది. అయితే భరిస్తున్నావు గనుక భర్త, భరింపబడుతోంది గనుక భార్య అనే పురాణ వాక్యం జ్ఞాపకంవచ్చి ఒళ్ళు చల్లబడింది. కాస్త తమాయించుకొని - 'ఏం చెయ్యమన్నావ్! డబ్బు కోసం వెళ్లా, మరి సర్దుబాటు కాలేదు.' అన్నాను.

మన కెప్పుడూ సర్దుబాటుకాదు.

ఆమాటా నిజమే.

అయితే ఎలా మరి?

ఎలా ఏమిటి?

దీపం లేకుండా ఎలాగడుస్తుంది, పిల్లలున్న కొంప.

చూద్దాంలే.

మా చేసరికి నూనె ఉండొద్దు - బజారు వస్తువా ఏమన్నానా? కంట్రోలు వస్తువు కూడాను.

అయితే కానియ్యి. జైనమతం'.

అంటే?

పెందలకడ రెండు మెతుకులు తిని మూడంకె వేయడమే. 'జైను'లంటే. మరి మాటాడకు.